సాక్షి
అనంతపురం

మంగళవారం । 17 । సెప్టెంబర్ । 2024



చీనీ టన్ను రూ.18 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.18 వేలు పలికాయి.



టమాట కిలో రూ.35

అనంతపురం కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.35 పలికింది. కనిష్టం రూ.20, సరాసరి రూ.28 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.9°/22.5°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

సబ్ స్టేషన్ ముట్టడించిన రైతులు



నిట్టూరు సబ్ స్టేషన్‌ను ముట్టడించిన రైతులు

యాడికి: పగటి పూటనే 9 గంటల విద్యుత్ ఇవ్వాలంటూ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రైతులు ముట్టడించిన ఘటన సోమవారం మండలంలో జరిగింది. మండలంలోని నిట్టూరు గ్రామంలో 10 రోజులుగా విద్యుత్ సరఫరా సక్రమంగా లేకపోవడంతో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిట్టూరు, చిక్కేపల్లె, కొత్తపల్లె గ్రామాల రైతులు, ప్రజలు ముట్టడించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గతంలో వ్యవసాయానికి పగటి పూట నిరంతర విద్యుత్ సరఫరా ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేశారన్నారు. రోజంతా కలిపి 7 గంటలు మాత్రమే ఇస్తున్నారన్నారు. రాత్రి వేళ నీటి తడులు కట్టేందుకు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పొలాల వద్దకు వెళ్తున్నామన్నారు. పాములు, పురుగులు, అడవి జంతువుల భయంతో అవస్థలు పడుతున్నామన్నారు. సక్రమంగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఏఈ రాజారావు నిట్టూరుకు చేరుకొని రైతులకు సర్దిచెప్పారు. సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కరిస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు.

100 శాతం 'ఈ-క్రాప్'



అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను 100 శాతం ఈ-క్రాప్ (పంట నమోదు) చేసినట్లు సోమవారం వ్యవసాయశాఖ జేడీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. సాధారణ సాగు విస్తీర్ణం 10,66,675 ఎకరాలుగా అంచనా వేయగా క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి వచ్చిన గణాంకాల ప్రకారం 8,88,575 ఎకరాల్లో పంటలు వేసినట్లు వెల్లడైందన్నారు. ఆర్‌ఎస్‌కేల వేదికగా 100 శాతం పంట నమోదు పూర్తయిందన్నారు. 97 శాతం మేర వీఏఏ, వీహెచ్‌ఏ, వీఎస్‌ఏల అథెంటికేషన్ కూడా పూర్తయినట్లు తెలిపారు. వీఆర్‌ఓల అథెంటికేషన్ తర్వాత ఇప్పటి వరకు 50 శాతం వరకు బయోమెట్రిక్ లేదా ఓటీపీ ఆధారంగా రైతుల ఈ-కేవైసీ పూర్తయినట్లు పేర్కొన్నారు. ఇంకా 50 శాతం వరకు ఈ-కేవైసీ పెండింగ్ ఉందని, ఈ నెల 23లోపు 100 శాతం పూర్తికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ-క్రాప్ చేయించుకున్న రైతులు తప్పనిసరిగా ఆర్‌ఎస్‌కే సిబ్బందిని సంప్రదించి ఈ-కేవైసీ కూడా చేయించుకోవాలని సూచించారు. లేదంటే ఈ-క్రాప్ పూర్తయినట్లు కాదన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్, ఎంఎస్‌పీ అమ్మకాలు, ఇతరత్రా ప్రభుత్వం నుంచి ప్రయోజనాలు పొందాలంటే ఈ-క్రాప్, ఈ-కేవైసీ తప్పనిసరిగా పూర్తి కావాలని తెలిపారు.

ఐక్యతకు నిదర్శనం బంజారాలు



సంప్రదాయ నృత్యం చేస్తున్న బంజారాలు

వజ్రకరూరు: తీజ్ ఉత్సవాలు బంజారాల ఐక్యతకు నిదర్శనంగా నిలిచాయని బంజారా సంఘం ప్రతినిధి ఎస్‌కే సుబ్రహ్మణ్యం నాయక్ అన్నారు. సోమవారం వజ్రకరూరు మండలం రూపా నాయక్ తండాలో తీజ్ ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. 11 రోజుల పాటు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. రూపానాయక్ తండాతో పాటు జరుట్ల రాంపురం, వెంకటాంపల్లి చిన్నతండా, పందికుంట తండా, కలగళ్ల తండా తదితర గ్రామాలనుంచి పెద్ద సంఖ్యలో గిరిజనులు హాజరయ్యారు. కార్యక్రమానికి బంజారా ప్రతినిధి వడితియా నర్సింగ్‌నాయక్ నేతృత్వం వహించారు. తీజ్ ఉత్సవాల పాటలు పాడుతూ సంప్రదాయ నృత్యాలతో రాత్రంతా సందడి చేశారు. బంజారా సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్‌కే కేశవనాయక్, ఎంపీపీ రమావత్‌దేవి, సర్పంచ్ కొర్రాశివాజీ నాయక్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



పేదలకు వైద్య విద్య భారం

పేద, మధ్య తరగతి విద్యార్థులు డొనేషన్లు కట్టి ప్రయివేటు కళాశాలల్లో చదవడం చాలా భారమైన పని. ఇప్పటి వరకూ పేదలకు వైద్య విద్య అనేది అందనిద్రాక్షగా మిగిలింది. గతంలో ఎన్నడూ లేని విధంగా గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలు వస్తే చాలా సంతోషించాం. పేద విద్యార్థులు ఎంబీబీఎస్ చదవాలంటే మెడికల్ కళాశాలల అవసరం ఉంది. కానీ, నేడు కూటమి ప్రభుత్వం మా ఆశలపై నీళ్లు చల్లింది. ప్రభుత్వ పెద్దల అనాలోచిత నిర్ణయం ఎంతో మంది పేదలకు వైద్య విద్యను దూరం చేస్తుంది. నిర్ణయంపై పునఃసమీక్షించుకోవాలి.

– నాగార్జున, బైపీసీ విద్యార్థి, తాడిపత్రి జూనియర్ కళాశాల



విద్యార్థులకు తీవ్ర అన్యాయం

కూటమి ప్రభుత్వం నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల్లోని విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తోంది. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన వైద్య కళాశాలల్లో అడ్మిషన్లు కల్పించకపోవడం దారుణం. ఎవరికో పేరొస్తుందని వేలాది మంది పిల్లల భవిష్యత్‌తో ఆడుకోవడం అన్యాయం. ఈ విషయంలో సీఎం చంద్రబాబు ఆలోచన సరి కాదు. వెంటనే కేంద్రంతో మాట్లాడి రాష్ట్రానికి అదనపు సీట్లు కేటాయించేలా చూడాలి. అలాగే నూతన మెడికల్ కళాశాలల ప్రారంభానికి సహకారమందించాలి.

– అక్బర్, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, గార్లదిన్నె



కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నాయకులు అక్రమార్జనకు బరి తెగించారు. ఆదాయం వచ్చే ఏ అవకాశాన్నీ వదులుకోవడం లేదు. సహజ వనరులను కొల్లగొడుతున్నారు. మట్టి, ఇసుక ఎక్కడ కన్పించినా జేసీబీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు దింపుతున్నారు. రేయింబవళ్లూ అక్రమంగా తరలిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి. ఇసుక అక్రమ తవ్వకాలతో నదులు, వాగులు, వంకల స్వరూపమే మారిపోతోంది. సహజ నీటి ప్రవాహానికి ఆస్కారం లేకుండా పోతోంది.

శింగనమల మండలం పి.జలాలపురం సమీపంలోని కూతలేరు వంకలో ఇసుక తవ్వకాలు చేపట్టిన దృశ్యం



ఇసుక తోడేళ్లు

- నదులు, వాగులు, వంకలను గుల్ల చేస్తున్న అధికార పార్టీ నాయకులు
- రేయింబవళ్లూ ఇసుక అక్రమ రవాణా
- మూడు టిప్పర్లు ఆరు ట్రాక్టర్లుగా దందా
- అన్ని నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- ఇదే అదనుగా మరింత రెచ్చిపోతున్న ఇసుకాసురులు

పోటీపడుతున్న 'తమ్ముళ్లు'

శింగనమల : నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణా కోసం టీడీపీ నాయకులు పోటీపడుతున్నారు. ఆ పార్టీలో ప్రతి గ్రామంలోనూ రెండు వర్గాలు ఉన్నాయి. ఒకరికి మించి ఒకరు దందాల్లో మునిగి తేలుతున్నారు. ముఖ్యంగా ఇసుక అక్రమ రవాణా ద్వారా భారీగా సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఒక వర్గం తవ్వకాలకు దిగితే మరొక వర్గం సమాచారం ఇస్తుండడంతో పోలీసులు వెళ్లి దాడులు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఇటీవల పలుచోట్ల అక్రమ ఇసుక డంప్‌లు వెలుగు చూశాయి. శింగనమల మండలంలోని కల్లుమడి, తరిమెల, నిదనవాడ, రాచేపల్లి, సలకంచెర్వు, పి.జలాలపురం, పెరవలి ప్రాంతాల్లోని పెన్నానది, కూతలేరు వంకలో ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. అక్కడి నుంచి నియోజకవర్గవ్యాప్తంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

వేదావతి హగరి నుంచి యథేచ్ఛగా..





రాయదుర్గం నుంచి ఉదయం 6 గంటలకే ఇసుక తరలిస్తున్న దృశ్యం, అర్ధరాత్రి ఇలా..

రాయదుర్గం: నియోజకవర్గంలోని వేదావతి హగరి నది నుంచి యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. హగరిలో లభ్యమయ్యే ఇసుకకు కర్ణాటక రాష్ట్రంలో మంచి డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో నది నుంచి ఇసుక తోడి పగలు ఒక చోట డంప్ చేసి రాత్రిళ్లు సరిహద్దులు దాటిస్తున్నారు. టిప్పర్ ఇసుక రూ.70 వేల నుంచి రూ.80 వేలు పలుకుతోంది. ఈ లెక్కన రోజూ రూ.లక్షలు జేబుల్లో వేసుకుంటున్నారు. గుమ్మఘట్ట మండలం భూపసముద్రం, రంగచేడు, ఎర్రంపల్లి వేదావతి హగరికి అర్ధరాత్రి దాటాక రాయదుర్గం నుంచి ఇసుక ట్రాక్టర్లు క్యూ కడుతున్నాయి. అలాగే కణేకల్లు మండలం రచ్చుమర్రి, కళేకుర్తి, నాగేపల్లి, మాల్యం నుంచి ఉరవకొండకు తరలిస్తున్నారు. బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్, బండూరు, కల్లుదేవనహళ్లి, బొల్లనగుడ్డం, డీ హీరేహాళ్ మండలం బాదనహాళ్, నాగలాపురం, హొస గుడ్డం, చెరువు, వంక ప్రాంతాల్లో ఇసుక కొల్లగొడుతున్నారు. ఈ ప్రాంతాల నుంచి సుమారు వంద ట్రాక్టర్లు, 20కి తక్కువ కాకుండా టిప్పర్లు తరలివెళుతున్నట్టు స్థానికులు చెబుతున్నారు. గుమ్మఘట్ట మండలం రంగచేడు వేదావతి హగరి సమీపాన మాన్యంలో సుమారు 30 ట్రిప్పుల ఇసుక నిల్వ చేశారు. స్థానికులు కొందరు సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకోవడంతో అక్రమ బాగోతం వెలుగుచూసింది.



గుమ్మఘట్ట మండలం రంగచేడు సమీపాన డంప్ చేసిన ఇసుక

పెన్నమ్మకు కన్నీరు



పామిడి సమీపంలోని పెన్నానదిలో ఇసుక తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

పామిడి : గుంతకల్లు నియోజకవర్గంలో టీడీపీ నాయకుల ఇసుక దందాతో పెన్నానది కన్నీరు పెడుతోంది. మరీ ముఖ్యంగా పామిడి సమీపంలోని పెన్నా నదిలో అంకాలమ్మ, కుంటిమ్మ ఆలయ సమీపాన ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధి అండతో స్థానికంగా అంతా తానై వ్యవహరిస్తున్న ఓ టీడీపీ నాయకుడి ఆధ్వర్యంలో రోజూ రాత్రిపూట సుమారు 50 టిప్పర్ల ద్వారా ఇసుక తరలిస్తున్నారు. కర్ణాటక, నంద్యాల, గుత్తి, గుంతకల్లు తదితర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. టిప్పర్ ఇసుక కర్ణాటకలో రూ.1.20 లక్షలు, నంద్యాల వంటి ఇతర జిల్లాల్లో రూ.60 వేలు, సమీప ప్రాంతాల్లో అయితే దూరాన్ని బట్టి రూ.25–30 వేలతో విక్రయిస్తున్నారు. ఓ పోలీస్ అధికారి బస చేస్తున్న లాడ్జీ సమీపాన గల హైవేపై నుంచే ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్లు వెళ్తున్నా ఏమాత్రమూ పట్టించుకోవడం లేదు. రెండు రోజుల క్రితం పెన్నాలో ఇసుక తవ్వకాలపై పామిడితో పాటు పెద్దవడుగూరు పోలీసులకు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఇసుక అక్రమ తవ్వకం చేపడుతున్న ప్రాంతానికి పోలీసులు వెళ్లారు. అప్పటికే అక్కడ టిప్పర్లు, ట్రాక్టర్లు 50 దాకా క్యూలో ఉన్నాయి. పోలీసులు వెళ్లిన విషయం తెలుసుకున్న నియోజకవర్గ ప్రజాప్రతినిధి వారికి ఫోన్ చేసినట్లు సమాచారం. దీంతో పెద్దవడుగూరు పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కానీ అప్పటికే ఈ విషయం బయటకు పొక్కడంతో చేసేదేమీ లేక పామిడి పోలీసులు తూతూమంత్రంగా చర్యలు చేపట్టారు. కేవలం ఒక టిప్పరు, ఇసుక లోడ్‌తో ఉన్న ఒక ట్రాక్టర్‌తో పాటు ఐదు ఖాళీ ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు మమ అనిపించారు.

రెచ్చిపోతున్న పచ్చ నాయకులు



నూతిమడుగు వద్ద పెన్నానదిలో ఇసుకను తవ్వి ట్రాక్టర్‌లో నింపుతున్న కూలీలు



నూతిమడుగు సమీపంలో ఇసుకను అక్రమంగా డంప్ చేసిన దృశ్యం

కంబదూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కంబదూరు మండలంలో చోటా మోటా టీడీపీ నాయకులు సైతం రెచ్చిపోతున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకొని యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు. మండలంలోని నూతిమడుగు, చెన్నంపల్లి, గూళ్యం, రాంపురం, రాళ్లపల్లి, రాళ్లఅనంతపురం గ్రామాల సమీపంలో పెన్నా నది నుంచి ఇసుకను తోడేస్తున్నారు. జేసీబీల సాయంతో సమీపంలో డంప్ చేసి టిప్పర్, ట్రాక్టర్లలో కర్ణాటక, అనంతపురం, కళ్యాణదుర్గం, కంబదూరు తదితర ప్రాంతాలకు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. అసలే తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సమయంలో టీడీపీ నాయకులు విచ్చలవిడిగా ఇసుకను తవ్వేస్తుండడంతో భూగర్భ జలాలు అడుగంటి వ్యవసాయ బోర్లు ఎండిపోతున్నాయి. ఈ క్రమంలో అక్రమ ఇసుక రవాణా వాహనాలను అడ్డుకుంటే రైతులనే బెదిరిస్తున్నారు. 'మాకు అండగా ఎమ్మెల్యే ఉన్నాడు.. మీకిష్టం వచ్చింది చేసుకోండి' అంటూ దౌర్జన్యానికి దిగుతున్నారు. వ్యవసాయ బోర్లు ఎండిపోతే గ్రామాలను వదిలి పట్టణాలకు వలస వెళ్లాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక దందా జోరుగా జరుగుతున్నా అధికార యంత్రాంగం చోద్యం చూస్తుండడంపై మండిపడుతున్నారు. మామూళ్లు అందుతుండడంతోనే అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని తెలుస్తోంది.



కంబదూరు సమీపంలోని వంక నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న దృశ్యం


కఠిన చర్యలు తీసుకుంటాం

ఇసుక అక్రమ రవాణా పై ప్రత్యేక నిఘా ఉంచుతాం. పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్ శాఖ అధికారులను అప్రమత్తం చేస్తాం. సంయుక్తంగా దాడులు నిర్వహించి అక్రమ రవాణాను అడ్డుకుంటాం. డీ హీరేహాళ్‌లో ఇప్పటికే అక్రమ డంప్‌లు సీజ్ చేశాం. రంగచేడు వద్ద వెలుగు చూసిన డంప్‌ను స్థానిక అధికారులతో కలిసి పరిశీలిస్తాం. జిల్లాలో ఎక్కడైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు చేపడతాం.

– నాగయ్య, మైనింగ్ డీడీ, అనంతపురం

'ప్రత్యామ్నాయ' ఆర్భాటం

- 27,909 క్వింటాళ్లు కేటాయింపు
- పంపిణీ చేసింది 2,200 క్వింటాళ్లే..



ఉలవ విత్తనాలు

అనంతపురం అగ్రికల్చర్: తానా అంటే తందానా అన్న చందంగా కూటమి సర్కారు ప్రచార ఆర్భాటానికి వ్యవసాయశాఖ తన వంతుగా భజన చేస్తోంది. ఖరీఫ్ సాగు విస్తీర్ణానికి సంబంధించి వ్యవసాయశాఖ వేసిన అంచనాలు తారుమారయ్యాయి. జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 3.46 లక్షల హెక్టార్లు కాగా, 2 లక్షల హెక్టార్లకు మించి రాకపోవచ్చని అంచనా వేశారు. అందుకు అనుగుణంగా కనీసం 1.50 లక్షల హెక్టార్లకు ప్రత్యామ్నాయ విత్తనాలు కావాలని ప్రతిపాదించారు. చివరకు 1.31 లక్షల హెక్టార్లకు సరిపడా జిల్లాకు ఉలవ, పెసర, అలసంద, మినుము, సజ్జ, కొర్ర తదితర విత్తనాలు 27,909 క్వింటాళ్లు కేటాయించారు. వాటిని 80 శాతం రాయితీతో ఇస్తామని, ఆర్‌ఎస్‌కేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఆగస్టు 15 తర్వాత పంపిణీ చేయాల్సి ఉండగా చాలా జాప్యం చేస్తూ గతానికి భిన్నంగా సెప్టెంబర్ మొదటి వారం తర్వాత మొదలు పెట్టడంతో రైతులు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఆగస్టు మూడో వారం మంచి వర్షాలు కురిశాయి. ఆ సమయంలో విత్తనం అంది ఉంటే రైతులు పంటలు వేసేవారు. తేమ పూర్తిగా ఆరిపోయిన తర్వాత పంపిణీ చేస్తుండటంతో ఉపయోగం లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతానికి 2,200 క్వింటాళ్లు మాత్రమే రైతులకు పంపిణీ చేసినట్లు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో 27,909 క్వింటాళ్లు పంపిణీ చేయడం, వాటిని రైతులు పంటలుగా సాగు చేయడం అనేది సాధ్యం కాదంటున్నారు.

రైతులకు మేలు శూన్యం..

అక్టోబర్ నుంచి రబీ సీజన్ మొదలవుతుంది. తాజాగా ఖరీఫ్ విస్తీర్ణం కూడా 2.50 లక్షల హెక్టార్లుగా చూపించారు. ఇందులో ప్రత్యామ్నాయ పంటల విస్తీర్ణం పెరగకపోవడం గమనార్హం. ఇటీవల కాలంలో వ్యవసాయశాఖ అధికారులందరూ కార్యాలయాలు, జూమ్ మీటింగ్‌లు, వీసీలు, టెలీకాన్ఫరెన్స్ అంటూ కార్యాలయాలకే పరిమితం అవుతున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్‌ఎస్‌కే అసిస్టెంట్లు మాత్రం ఈ-క్రాప్, ఈ-కేవైసీపై దృష్టి సారిస్తూ ప్రత్యామ్నాయ విత్తనాలు, ఖరీఫ్ పంట స్థితిగతులపై ఆలోచించే పరిస్థితి కనిపించడం లేదు. ఇచ్చేది కొంచెమైనా సకాలంలో రైతుకు చేరిస్తే ఫలితం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చంద్రబాబు ప్రభుత్వం, వ్యవసాయశాఖ ప్రచార ఆర్భాటం తప్ప రైతులకు మేలు చేసింది శూన్యమని చెబుతున్నారు.



అనంతపురంలో ఊరేగింపులో భారీ సంఖ్యలో పాల్గొన్న ముస్లింలు



గుంతకల్లులో ఆకట్టుకున్న మక్కా మసీదు నమూనా

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

జిల్లావ్యాప్తంగా సోమవారం మిలాద్ ఉన్ నబీ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రవక్త జీవిత చరిత్రపై మౌలానాలు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేశారు. జులూస్ పేరుతో మక్కా, మదీన నమూనాలతో ఘనంగా ఊరేగింపు నిర్వహించారు.

– సాక్షి బృందం



ఉరవకొండలో జెండా ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా వాసులకు పతకాలు



గెలుపొందిన క్రీడాకారులతో నిర్వాహకులు

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరులో శనివారం ప్రారంభమైన 36వ రాష్ట్ర స్థాయి బాల బాలికల టెన్నికాయిట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. బాలుర విభాగంలో నాల్గో స్థానంలో అనంతపురానికి చెందిన జి.మహిధర్ నిలిచాడు. అలాగే బాలిక విభాగంలో విజేత కప్‌ను అనంతపురానికి చెందిన కె.జ్యోతిక దక్కించుకోగా.. ద్వితీయ స్థానంలో హెచ్. దీక్షిత, తృతీయ స్థానంలో హెచ్.స్పందన నిలిచారు. ప్రతిభ చాటిన వీరిని ఈ నెల 30 నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకూ జమ్ముకాశ్మీర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన బాలికలకు అనకాపల్లిలో, బాలురకు తూర్పుగోదావరి మండపేటలో శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

టపాసుల విక్రయాల లైసెన్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం రూరల్: దీపావళి సందర్భంగా టపాసులు విక్రయించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఈ మేరకు అనంతపురం ఇన్‌చార్జ్ ఆర్డీఓ వసంతబాబు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో దరఖాస్తు చేసుకున్న వారికి తాత్కాలిక లైసెన్స్‌లు మంజూరు చేస్తారు. ఈ నెల 17 నుంచి అక్టోబర్ 7వ తేదీలోపు దరఖాస్తులను అందజేయాలి. పూర్తి వివరాలకు www.peso.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు.



చేతగాని తనానికి నిదర్శనం

విద్య, వైద్య రంగాలను ప్రభుత్వమే నడపాలి. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు వైద్య విద్యను ప్రభుత్వమే అందించాలి. అలాకాకుండా వైద్య కళాశాలలను నిర్వహించలేమంటూ ఎన్‌ఎంసీకి లేఖ రాయడం కూటమి సర్కార్ చేతగానితనానికి నిదర్శనం. కేవలం కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకే వైద్య విద్యను ప్రైవేటీకరణ చేసే దిశగా ఆలోచిస్తున్నారు. ఇదే కనుక జరిగితే ఇకపై పేదలకు విద్య, వైద్యం అందని ద్రాక్షగా మారుతాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నూతనంగా ఏర్పాటైన ఐదు మెడికల్ కళాశాలల్లో సీట్లు భర్తీ చేయాలి. అలాగే ఏడు కళాశాలల పనులు కొనసాగించాలి.

– గంగాధర, గోనబావి, గుమ్మఘట్ట మండలం



మంత్రి మాటలు సరికాదు



రాష్ట్ర వ్యాప్తంగా నూతన వైద్య కళాశాలలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే అందుబాటులో ఉన్న ఐదు కళాశాలలను ప్రారంభించకుండా కూటమి ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలతో ముందుకు సాగుతోంది. సీఎం చంద్రబాబు నిర్ణయం విద్యార్థుల పాలిట శాపంగా మారింది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య విద్యకు కల్పించిన ప్రాధాన్యతను తప్పు బట్టేలా మంత్రి సత్యకుమార్ వ్యాఖ్యలు ఉన్నాయి. ఆయన మాటలు సరికాదు. విద్యార్థులకు వైద్య విద్యను మరింత చేరువ చేసేలా చొరవ తీసుకోవాలి. ఉన్న కళాశాలలను రద్దు చేసేలా వ్యవహరించడం సరికాదు.

– నరేష్ యనమల, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అనంతపురం

మేలు జాతి జీవాలకు అడ్డా ఉరవకొండ

- ప్రతి వారం రూ.2 కోట్ల మేర వ్యాపార లావాదేవీలు
- జిల్లా నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి భారీగా వస్తున్న కొనుగోలుదారులు
- గొర్రెల పెంపకంతో లాభాలు ఆర్జిస్తున్న కాపరులు

ఉరవకొండ: మేలు జాతి గొర్రెల మార్కెట్‌కు జిల్లాలోని ఉరవకొండ ప్రసిద్ధి గాంచింది. జిల్లా నలమూలల నుంచే కాక పొరుగున ఉన్న కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వ్యాపారులు తరలి వచ్చి జీవాలను కొనుగోలు చేసుకెళుతుంటారు. స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డు కార్యాలయ ప్రాంగణంలో ప్రతి సోమవారం నిర్వహించే జీవాల మార్కెట్ ద్వారా వారానికి రూ.2 కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతుండడం గమనార్హం. ఈ మార్కెట్‌కు అత్యధికంగా తెలంగాణ ప్రాంతానికి చెందిన వ్యాపారులే వస్తుంటారు. 20 కిలోల నుంచి 70 కిలోల బరువున్న మేలు జాతి పొట్టేళ్లు కూడా ఇక్కడ విక్రయానికి కాపరులు తీసుకువస్తుంటారు. జీవాల ఆరోగ్యం, బరువును బట్టి రూ.10వేల నుంచి రూ.80 వేల వరకూ విక్రయిస్తుంటారు. ఇక్కడి నుంచి ప్రత్యేక వాహనాల్లో పొట్టేళ్లు, గొర్రెలు, మేకలను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు.



క్రయవిక్రయదారులతో కిక్కిరిసిన ఉరవకొండ గొర్రెలు, మేకల మార్కెట్





బేరం చేస్తున్న మిర్యాలగూడ వ్యాపారస్తులు, రూ.70వేలకు అమ్మకానికి పెట్టిన పొట్టేలు

కనీస వసతులు కల్పించాలి

ప్రతి సోమవారం జరిగే గొర్రెల మార్కెట్‌లో వందలామంది జీవాలను తీసుకొచ్చి అమ్ముతుంటారు. మార్కెట్లో నీడ, నీరు సౌకర్యం లేదు. ఆదాయం మాత్రం చాలా పెద్దగానే ఉంటోంది. జీవాలను పెట్టుకోవడానికి ప్రత్యేకంగా స్థలం కొనుగోలు చేస్తే వ్యాపారస్తులకు అనువుగా ఉంటుంది. – రంజాన్‌సాహెబ్, ఉరవకొండ

ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డివిజన్‌లో గొర్రెలు, మేకల వివరాలు

మండలం	గొర్రెలు	మేకలు	మొత్తం
రాయదుర్గం	35,155	12,365	47,520
కళ్యాణదుర్గం	1,29,258	15,941	1,45,199
గుంతకల్లు	88,777	9,915	98,692
కణేకల్లు	47,458	10,248	57,706
ఉరవకొండ	1,03002	25,156	1,28,158
విడపనకల్లు	31,974	5,793	37,767
డి.హీరేహాల్	70,812	23,905	94,717
బెళుగుప్ప	24,986	4,102	29,088
శెట్టూరు	88,428	31,758	1,20,186
గుమ్మఘట్ట	64,907	16,678	81,585
బొమ్మనహాళ్	78,820	7,210	86,030
కుందుర్పి	1,15,274	29,439	1,44,713
వజ్రకరూరు	64,883	10087	74,970

మూడేళ్లుగా ఇక్కడికే వస్తున్నాం



గత మూడేళ్లుగా ఉరవకొండ మార్కెట్‌కు ప్రతి సోమవారం క్రమం తప్పకుండా వస్తున్నాం. వారం వారం మేలు రకం పొట్టేళ్లు వంద వరకు కొనుగోలు చేసి మా ప్రాంతానికి ప్రత్యేక వాహనంలో తీసుకెళుతుంటాను. ఇక్కడి జీవాలు బాగా బలంగా ఉంటాయి. హైదరాబాద్‌లో జరిగే పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలకు ఇక్కడి పొట్టేళ్లకు భలే డిమాండ్ ఉంటుంది.

– శంకర్‌గౌడ్, మిర్యాలగూడ, హైదరాబాద్

ప్రభుత్వం ప్రోత్సహించాలి



జీవాల పెంపకంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ప్రతి సోమవారం ఇక్కడి మార్కెట్‌కు జీవాలను తీసుకొచ్చి అమ్ముతుంటా. పొట్టేలుపై మంచి లాభం వస్తోంది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే జీవాల పోషణ లాభదాయకంగా ఉంటుంది.

– సోమేశ్వరకుమార్, కళ్యాణదుర్గం

గొర్రె పిల్లలను కొనుగోలు చేస్తా



ఉరవకొండ మార్కెట్లో ఒక్కో చిన్న గొర్రె పిల్లను రూ.2వేలు చొప్పున మొత్తం 10 పిల్లలను కొనుగోలు చేసి మా ప్రాంతానికి తీసుకెళ్లి పోషిస్తాను. వాటికి పచ్చి మేత, ఇతర పోషకాహారాన్ని అందించి బలంగా తయారైన తర్వాత ఇదే మార్కెట్‌కు తీసుకొచ్చి అమ్ముతాను. పొట్టేళ్లకు మంచి డిమాండ్ ఉండడంతో లాభం కూడా అదే స్థాయిలో వస్తుంది. – గోపాలయ్య, రాయదుర్గం

వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక రైతు ఆత్మహత్య



రాజశేఖర్ (ఫైల్)

గుంతకల్లు రూరల్: వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం చింతలాంపల్లికి చెందిన జయరాముడు, శంకరమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు కాగా, రెండో కుమారుడు రాజశేఖర్ (35) వ్యవసాయంతో కుటుంబానికి చేదోడుగా నిలిచాడు. పదేళ్ల క్రితం వివాహమైన ఆయనకు భార్య గీత, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన నాలుగు ఎకరాల పొలంతో పాటు మరో 10 ఎకరాలను కౌలుకు తీసుకుని పంటల సాగు చేపట్టాడు. ఈ క్రమంలో పంటల సాగుకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద రూ.12 లక్షల వరకూ అప్పు చేశాడు. గత రెండేళ్లుగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పంట దిగుబడులు ఆశించిన మేర రాలేదు. దీంతో అప్పులకు వడ్డీల భారం పెరిగి రూ.15 లక్షలకు చేరింది. కొన్ని రోజులుగా తమ అప్పు తీర్చాలంటూ వడ్డీ వ్యాపారుల నుంచి తీవ్ర వేధింపులు మొదలయ్యాయి. దీంతో గ్రామంలో పరువు పోతోందని భావించిన ఆయన ఆదివారం రాత్రి క్రిమి సంహారక మందు తాగి ఇంటికి చేరుకున్నాడు. కాసేపటి తర్వాత అతడి మాటల్లో తేడా రావడం, పురుగుల మందు వాసన వస్తుండడంతో అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు వెంటనే 108 అంబులెన్స్ ద్వారా గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం వద్వైద్యుల సూచన మేరకు రాజశేఖర్‌ను కర్నూలుకు తీసుకెళ్లే ఏర్పాటుచేస్తుండగా ఆదివారం అర్ధ రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గుంతకల్లు రూరల్ ఎస్‌ఐ రాఘవేంద్రప్ప కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

బావ కుటుంబంపై బామ్మర్ది దాడి

రాప్తాడురూరల్: తన చెల్లెలును ఇబ్బంది పెడుతున్నారని భావించిన బామ్మర్ది... ఏకంగా తన బావ కుటుంబంపై దాడికి పాల్పడ్డాడు. బాధితులు సోమవారం అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు... అనంతపురం రూరల్ మండలం కురుగుంట వైఎస్సార్‌కాలనీలో నివాసముంటున్న శర్మాస్‌వలి, జైనాబీ దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. బేల్దారి పనులతో శర్మాస్‌వలి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్న జైనాబీకి నగరంలోని ఓ ఆస్పత్రిలో ఆయన చికిత్స చేయిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం ఇంట్లో నుంచి రోడ్డు మీదకు వచ్చిన జైనాబీ గట్టిగా కేకలు వేస్తూ ఆటుగా వెళ్లేవారందరినీ తిడుతూ నిలబడింది. వెంటనే భర్త శర్మాస్‌వలి, కుమారుడు అబ్దుల్ రహీమ్ అక్కడికి చేరుకుని జైనాబీని ఇంట్లోకి పిలుచుకెళుతుండగా ఆమె వారి చేతిని కూడా కొరికింది. దీంతో బలవంతంగా ఇంట్లోకి తీసుకెళ్లి మంచానికి కట్టేశారు. తర్వాత రోజు ఉదయాన్నే ఆస్పత్రికి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న జైనాబీ సోదరుడు బారా ఇమామ్... గుంతకల్లుకు చెందిన చిన్న, సతీష్, అజయ్, నరసింహులుతో కలసి రాత్రి 11 గంటల సమయంలో అక్కడకు చేరుకుని తన అక్కను కట్టేసి కొడుతున్నారంటూ శర్మాస్‌వలి, అతని కుమారుడిపై దాడి చేశారు. ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



సమ్మెలో పాల్గొన్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

కళ్యాణదుర్గం రూరల్: శ్రీసత్యసాయి, శ్రీరామరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు ధ్వజమెత్తారు. స్థానిక తహసీల్దార్ కార్యాయం ఎదుట గత 12 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులకు సోమవారం ఆయన మద్దతు తెలిపారు. ఉమ్మడి అనంతపురంలో జిల్లాలో వందలాది గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్న కార్మికులకు కనీస జీతాలను కూడా చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. తక్షణమే కార్మికుల వేతన బకాయిలు చెల్లించకపోతే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల, నాయకులు వన్నూరుస్వామి, వన్నూరప్ప, కార్మికులు పాల్గొన్నారు.

నవోదయ దరఖాస్తు గడువు పొడిగింపు

లేపాక్షి: జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ నాగరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుకు ఈనెల 16వ తేదీ వరకు మాత్రమే గడువు ఉండేదని, వివిధ కారణాలతో చాలా మంది దరఖాస్తు చేసుకోలేకపోయినందున గడువు ఈనెల 23వ తేదీ వరకూ పొడిగించినట్లు వెల్లడించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సీమ ద్రోహి చంద్రబాబు

- వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి



మాట్లాడుతున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

అనంతపురం కార్పొరేషన్: అధికారం చేపట్టిన ప్రతిసారీ రాయలసీమ వాసులకు ద్రోహం చేయడం సీఎం చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వెన్నపూస రవీంద్రారెడ్డి ధ్వజమెత్తారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ ద్రోహిగా మారిన చంద్రబాబు తాజాగా వైద్య కళాశాలల ఏర్పాటును అడ్డుకుని 3 లక్షల మంది ఇంటర్ బైపీసీ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులు వైద్య విద్యనభ్యసించేలా రూ.8,500 కోట్లతో 17 వైద్య కళాశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. ఇందులో రాయలసీమలోని ఆదోని, పులివెందుల వైద్య కళాశాలల్లో 300 సీట్లు భర్తీ చేసే అవకాశముందన్నారు. ఈ క్రమంలోనే పులివెందుల వైద్య కళాశాలలో 50 సీట్ల భర్తీకి ఆదేశాలు జారీ అయితే ఆ కళాశాలను నడపలేమంటూ ఎన్ఎంసీకి కూటమి ప్రభుత్వం లేఖ రాయడం సిగ్గు చేటన్నారు. పులివెందుల వైద్య కళాశాలను సందర్శించకుండానే అక్కడ మౌలిక వసతులు లేవంటూ బుకాయించడం కూటమి సర్కార్ చేతకాని తనానికి నిదర్శనమన్నారు. వాస్తవానికి నూతనంగా ఏర్పాటైన పులివెందుల వైద్య కళాశాలలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2023, డిసెంబర్ 15 నాటికి అన్ని రకాల మౌలిక వసతులు కల్పించిందన్నారు. ఈ కళాశాలను 2024, మార్చిలో ప్రారంభించిన విషయాన్ని మరుగున పరుస్తూ కేవలం వైఎస్ జగన్‌కు మంచి పేరు రాకూడదనే కుట్రతో విద్యార్థుల భవిష్యత్తుతో కూటమి సర్కార్ చెలగాటమాడుతోందన్నారు. చంద్రబాబు కుట్రలకు మంత్రి సత్యకుమార్ సైతం వత్తాసు పలుకుతూ వైద్య విద్యను నిర్వీర్యం చేసేలా వ్యాఖ్యలు చేస్తుండడం బాధాకరమన్నారు. పట్టభద్రులకు, విద్యార్థులకు, నిరుద్యోగులకు అండగా ఉంటామని చెప్పి గద్దె నెక్కిన ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాలరెడ్డి సైతం ఈ అన్యాయంపై నోరు మెదపకపోవడం సిగ్గు చేటన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు కిరణ్‌కుమార్, అయూబ్, అజయ్, చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు.

తుంగభద్ర డ్యాం గేట్లు మార్చాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

ఉరవకొండ: జిల్లాకు వరదాయినిగా ఉన్న తుంగభద్ర డ్యాంను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని, ఈ క్రమంలో ఇప్పటికే శిథిలావస్థకు చేరుకున్న డ్యాం 33 గేట్లను మార్చేలా కర్ణాటక ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకెళ్లాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై ఈ నెల 19న జరిగే ఐఏబీ సమావేశంలో చర్చించాలని సూచించారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తుంగభద్ర డ్యాం గేట్లు మార్చాలని సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలోని కమిటీ ఇప్పటికే బోర్డుకు స్పష్టం చేసిందన్నారు. 45 ఏళ్లకు ఒకసారి డ్యాం గేట్లు మార్చాల్సి ఉన్నా.. 70 ఏళ్లైనా తుంగభద్ర డ్యాంకు గేట్లను మార్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే గేట్లు తుప్పుపట్టి బలహీనంగా మారాయన్నారు. 33 గేట్లు మార్చడానికి రూ.264 కోట్లు వ్యయం అవుతుందని, ఈ ఖర్చును తెలంగాణ, కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాలు నీటి కేటాయింపులు, ఆయకట్టు ఆధారంగా దామాషా పద్ధతిలో భరించాల్సి ఉంటుందన్నారు. అలాగే తుంగభద్ర డ్యాం పూర్తిగా నిండడంతో అనంతపురం జిల్లాలోని అన్నీ చెరువులను నీటితో నింపాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేసి జిల్లాలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉరవకొండ, వజ్రకరూరు, కూడేరు మండల సీపీఐ కార్యదర్శులు మల్లికార్జున, సుల్తాన్, నారాయణమ్మ, పార్టీ నాయకులు గన్నేమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో తెగిన యువకుడి చేయి



ధనుష్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

నందలూరు: అన్నమయ్య జిల్లా నందలూరు రైల్వే స్టేషన్‌లో సోమవారం మధ్యాహ్నం రైలు కింద పడి యువకుడి చేయి తెగింది. బాధితుడిని గుంతకల్లుకు చెందిన కురుబ ధనుష్‌గా గుర్తించారు. పుత్తూరు సిద్దార్థ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్న ధనుష్... సోమవారం గుంతకల్లు నుంచి కళాశాలకు వెళ్లేందుకు ముంబై నుంచి చెన్నై వెళ్తున్న (12163) ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కాడు. ప్రమాదవశాత్తు నందలూరులో అదే రైలు కింద పడడంతో చేయి పూర్తిగా తెగిపోయింది. వెంటనే ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సిబ్బంది స్పందించి క్షతగాత్రుడిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి ఆటోలో తరలించారు.

వైద్య విద్యను ప్రైవేటీకరిస్తే ఉద్యమిస్తాం

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దార్థ్

ఉరవకొండ: వైద్య విద్యను ప్రైవేటీకరిస్తే తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామని కూటమి సర్కార్‌ను ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దార్థ్ హెచ్చరించారు. సోమవారం ఉరవకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద, సామాన్య విద్యార్థులకు వైద్య విద్య అందకుండా సీఎం చంద్రబాబు కుట్ర చేస్తున్నారన్నారు. ఈ ఏడాది ఐదు కళాశాలలు, వచ్చే ఏడాది మరో ఏడు మెడికల్ కళాశాలలు ప్రారంభించేలా కార్యాచరణను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూపొందించి 1,750 ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. వాటిని నిర్వహించడం చేతకాక కొత్త కళాశాలలను రద్దు చేసే యోచనలో సీఎం చంద్రబాబు ఉండడం సిగ్గు చేటన్నారు. వెంటనే వైద్య కళాశాలలను ప్రారంభించి, సీట్ల భర్తీకి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో స్థానిక ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీలో మృతదేహం వెలికితీత



విజయ్‌కుమార్ మృతదేహాన్ని వెలికి తీస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన విజయ్‌కుమార్ (52) మృతదేహాన్ని సోమవారం వెలికి తీశారు. శనివారం బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లుకు కుటుంబసభ్యులతో కలసి వచ్చిన ఆయన హెచ్చెల్సీలో స్నానం కోసం దిగి గల్లంతైన విషయం తెలిసిందే. అప్పటి నుంచి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం కణేకల్లు మండలం గనిగేర గ్రామ సమీపంలో కాలువలో మృతదేహం కనిపించడంతో వెలికి తీసి కణేకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు మదన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ నబీరసూల్ తెలిపారు.

వివాహిత బలవన్మరణం



మృతురాలు అనిత

అనంతపురం: అదనపు కట్నం వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలోని నాల్గో రోడ్డులో నివాసముంటున్న లాకే పెద్దముని కుమారుడు లాకే బాలాజీ అలియాస్ బాలుకు ఐదేళ్ల క్రితం అనిత(27)తో వివాహమైంది. వీరికి ఓ నాలుగేళ్ల వయసున్న కుమారుడు, రెండేళ్ల వయసున్న కుమార్తె ఉన్నారు. పెళ్లి సమయంలో వరుడికి కట్నకానుకల కింద 10 తులాల బంగారం, 5 సెంట్ల స్థలాన్ని వధువు తండ్రి వి.రెడ్డి ఇచ్చారు. పెళ్లైన రెండేళ్ల తర్వాత అదనపు కట్నం కావాలంటూ అనితను భర్త బాలాజీ, అత్త హైమావతి, మామ పెద్దముని వేధించసాగడంతో పెద్ద మనుషుల సమక్షంలో అప్పట్లో పంచాయితీ నిర్వహించి, రాజీ చేశారు. ఇటీవల అత్తింటి వేధింపులు తారాస్థాయికి చేరుకోవడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉదయం 10 గంటల సమయంలో ఇంట్లోనే అనిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతురాలి తల్లి వాకడే నాగమ్మ ఫిర్యాదు మేరకు అనంతపురం మూడో పట్టణ సీఐ శాంతిలాల్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా గౌని పాతిరెడ్డి



అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) కార్యదర్శిగా గౌని పాతిరెడ్డి ఎన్నికయ్యారు. రెండు రోజుల క్రితం విజయవాడలో జరిగిన సమావేశంలో నిర్వహించిన ఎన్నికల్లో జిల్లా నుంచి ఇద్దరు పోటీ పడ్డారు. కళ్యాణదుర్గం మండలం హులికల్లు ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న గౌని పాతిరెడ్డిని మెజార్టీ సభ్యులు ప్రతిపాదించారు. తన ఎంపికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షులు చెన్నుపాటి మంజుల, ప్రధాన కార్యదర్శి భానుమూర్తి, సీనియర్ నాయకులు పాండురంగ వరప్రసాద్‌కు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పాతిరెడ్డి ఎన్నికపై జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, కార్యదర్శి నరేష్‌కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

తైక్వాండో పోటీల్లో ప్రతిభ



రజత పతకంతో యోగ చర్విత

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని లక్ష్మీ సినర్జీ స్కూల్ విద్యార్థిని జి.యోగ చర్విత జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా చాటింది. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఆగ్రాలో ఈనెల 9, 10, 11 తేదీల్లో నిర్వహించిన జూనియర్ జాతీయ తైక్వాండో పోటీల్లో అండర్–68 కేటగిరీలో యోగ చర్విత రజత పతకం సాధించింది. గతంలో సబ్ జూనియర్ భవిష్య అండర్–22 పోటీల్లో రజత పతకం, అంబేడ్కర్ నందకృష్ణ పోటీల్లో కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. విద్యార్థిని యోగ చర్విత, కోచ్ రామాంజనేయులును పాఠశాల యాజమాన్యం అభినందించింది.

ఏఎస్ఐకి సన్మానం



ఒన్నూరురెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం ఇటుకలపల్లి పీఎస్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న ఒన్నూరు రెడ్డి ఇటీవల ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. రాయదుర్గం స్టేషన్‌కు బదిలీ అయిన ఒన్నూరు రెడ్డిని సోమవారం స్టేషన్‌లో సన్మానించారు. సీఐ హేమంత్ కుమార్, ఎస్ఐ విజయ్‌కుమార్, సిబ్బంది ఒన్నూరురెడ్డికి శాలువా కప్పి పూలమాలు వేసి సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐ మాట్లాడుతూ.. ఒన్నూరురెడ్డి సేవలను కొనియాడారు.

భక్తిశ్రద్ధలతో ఓనం పండుగ



అలంకరణలో అయ్యప్ప, కాశీవిశ్వేశ్వర స్వామి

అనంతపురం సెంట్రల్: నగరంలో మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో క్రోధి నామ సంవత్సరం దక్షినాయణం వర్ష రుతువు భాద్రపద శుద్ధ త్రయోదశని పురస్కరించుకుని ఓనం పండుగను ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి విగ్రహానికి సుగంధ ద్రవ్యాభిషేకం, వనమూలికలతో అభిషేకం చేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో 20న జాబ్‌మేళా

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 20న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, అమర్‌రాజ గ్రూప్, రిలయన్స్ నిప్పాన్ లైన్ ఇన్సూరెన్స్, వికాస్ అండ్‌డీఎస్‌సీ కంపెనీల సహకారంతో ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జరగనున్న జాబ్‌మేళాలో జిల్లాలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. టెన్త్ నుంచి ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన వారు సంబంధిత సర్టిఫికెట్లతో 20న ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు. మరింత సమాచారం కోసం 9182920381, 9988853335 సంప్రదించాలన్నారు.



వైద్య విద్య అభ్యసించడం కష్టం

ప్రభుత్వ మెడికల్ కళాశాలలు వస్తే చంద్రబాబుకు వచ్చే నష్టం ఏమిటో అర్థం కావడం లేదు. మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలనుకోవడం దారుణం. గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులు రూ.లక్షల ఫీజులు చెల్లించి ప్రైవేటు కళాశాలల్లో వైద్య విద్యను అభ్యసించడం కష్టం. ప్రభుత్వ కళాశాలల్లో సీట్లు పెంచి పేద విద్యార్థులకు న్యాయం చేయాలి. దీనికి విరుద్ధంగా చంద్రబాబు ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుంది.

– సంగప్ప, యలకుంట్ల, కనగానపల్లి మండలం

ప్రభుత్వ వైఖరి సరిగా లేదు

కొత్త మెడికల్ కళాశాలల ఏర్పాటు విషయంలో చంద్రబాబు ప్రభుత్వ వైఖరి సరిగా లేదు. రాష్ట్రంలో కొత్తగా ప్రభుత్వ కాలేజీలు వచ్చి మెడికల్ సీట్లు పెరిగితే పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది. దీనిని ఆలోచించకుండా ప్రభుత్వం మంజూరైన సీట్లను కూడా రద్దు చేస్తామనడం దుర్మార్గం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేట్ పరం చేయాలనుకోవడం సరికాదు. వైద్య విద్యను పేద విద్యార్థులకు అందకుండా చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది.

– వెంకటరాముడు, తగరకుంట, కనగానపల్లి మండలం



ఘనంగా మిలాద్–ఉన్–నబీ



లాల్‌బండ్ వీధిలో మహమ్మద్ ప్రవక్త సందేశం వివరిస్తున్న మౌలానా



మహమ్మద్ ప్రవక్త కేశ దర్శనంలో మాజీ ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, మేయర్ వసీం, తదితరులు



మహమ్మద్ ప్రవక్త కేశ దర్శనం కోసం బారులు తీరిన ముస్లింలు

అనంతపురం/అనంతపురం సెంట్రల్/ఆత్మకూరు: అనంతపురంలో సోమవారం మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మిలాద్–ఉన్–నబీ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు మసీదుల ఆధ్వర్యంలో జెండాలతో ర్యాలీ చేపట్టారు. యువత డప్పుచప్పుళ్ల మధ్య అల్లాహు అక్బర్ అంటూ నినాదాలు చేశారు. భారీగా తరలి వచ్చిన ముస్లింలతో టవర్ క్లాక్ ప్రాంతం కిక్కిరిసి పోయింది. పాతూరు అస్సార్ వీధిలో మహమ్మద్ ప్రవక్త కేశ దర్శనంలో మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం పాల్గొన్నారు. అలాగే మొదటి రోడ్డు మొహిద్దిన్ మసీదు నుంచి చేపట్టిన ర్యాలీలో మేయర్ వసీం సలీం, ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షకీల్ షఫీ తదితరులు పాల్గొన్నారు. పాతూరులోని మాసుమా బీబీ దర్గా, అసర్ షరీఫ్, రెండో రోడ్డులో బహవుద్దీన్, రహమత్ నగర్‌లోని మజీదే గౌసియా మసీద్‌లో మిలాద్–ఉన్–నబీ వేడుకలు జరిగాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకట్రామిరెడ్డి, మేయర్ వసీం సలీం, మార్కెట్ యార్డ్‌మాజీ చైర్మన్ ఫయాజ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాఫుజ్‌ఫర్ రిజ్వాన్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లా బేగ్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అనంత చంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జమాతే ఇస్లామీ హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో మిలాద్–ఉన్–నబీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రాజీవ్ కాలనీలోని వృద్ధ, అనాథాశ్రమంలో పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు అఖిల ఫర్వీన్ మాట్లాడుతూ.. మహమ్మద్ ప్రవక్త జన్మదినం రోజున మిలాద్–ఉన్ నబీ పండుగ జరుపుకుంటారని తెలిపారు. భువానులపై కరుణ చూపండి.. మీపై దేవుడు కరుణ చూపుతాడన్న ప్రవక్త సూక్తిని దృష్టిలో పెట్టుకుని జమాత్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. ప్రతి ఒక్కరూ మహ్మద్ ప్రకక్తను ఆదర్శంగా తీసుకుని పరుల విషయంలో దయ చూపుతూ సేవ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా విభాగం సభ్యులు రెహానా, భాను, సల్మా, నుసురత్ తదితరులు పాల్గొన్నారు. ఆత్మకూరులో నూరియా, జామియా మసీదు నుంచి పూలతో అలంకరించిన చాందినిని ట్రాక్టర్‌పై కొలువుదీర్చి ఊరేగించారు. డప్పుచప్పుళ్ల మధ్య ఆరే తక్బీర్ యా రసూలల్లా అంటూ స్థానిక సర్దార్ వలి దర్గా వద్దకు గంధం తీసుకెళ్లి చదివింపులు చేయించారు. అనంతరం మసీదు వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



అనాథాశ్రమంలో స్వీట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



ఆత్మకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు



మిలాద్–ఉన్–నబీ సందర్భంగా మినార్లతో ర్యాలీ



అల్లాహు అక్బర్ అంటూ నినాదాలు చేస్తున్న ముస్లింలు



నగరంలో బైక్ ర్యాలీ చేపట్టిన యువత



జెండాలతో చిన్నారుల సందడి



పాతూరు నుంచి ర్యాలీగా వస్తున్న ముస్లింలు



మొహిద్దీన్ మసీదు వద్ద కోలాహలం

దుమ్ము ఎగిసి.. ధూళి కమ్మేసి



వాహనాలు వెళ్లడంతో కమ్ముకున్న దుమ్ము

రుద్రంపేట నుంచి ఆలమూరు వెళ్లే మార్గంలో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో రోడ్డు వేసేందుకు కంకర తోలారు. రోడ్డు నిర్మించకపోవడంతో కంకర తేలిపోయింది. వాహనాలు పెద్ద సంఖ్యలో వస్తుండటంతో దుమ్ము, ధూళి రేగుతోంది. ఒక్కోసారి ఎదురుగా వచ్చే వాహనాలు కూడా కనబడటం లేదు. ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. వాహనదారులు దుమ్ము, ధూళితో అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



కళ్లలోకి దుమ్ము పడటంతో వాహనదారుడి అవస్థలు

సత్యసాయి తాగునీటి సరఫరా పునరుద్ధరణ

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాలకు సత్యసాయి నీటిసరఫరాను పునరుద్దరిచారు. సత్యసాయి కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలతోపాటు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆగస్టు 22 నుంచి సత్యసాయి కార్మికులు నిరవధిక సమ్మెలోకి వెళ్లారు. దీంతో గ్రామాలకు సత్యసాయి నీటిసరఫరా నిలిచిపోయింది. జిల్లా ఉన్నతాధికారుల హామీ మేరకు ఈనెల ఈనెల 12న సత్యసాయి కార్మికులు విధుల్లోకి చేరారు. సోమవారం కొనకొండ్ల సత్యసాయి రిజర్వాయర్ నుంచి గ్రామాలకు సత్యసాయి నీటి సరఫరాను ప్రారంభించినట్లు సత్యసాయి రిజర్వాయర్ ఇంజనీర్ బాలుయాదవ్ తెలిపారు.

రూ.17.2 లక్షల రికవరీకి ఆదేశం

బెళుగుప్ప: మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవకతవకల్లో రూ.17.2 లక్షలు రివకరీకి డ్వామా ఏపీడీ సుధాకర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ పెద్దన్న, ఎంపీడీఓ రామచంద్ర ఆధ్వర్యంలో ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. డ్వామా ఏపీడీ సుధాకర్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ లక్ష్మీనారాయణ హాజరయ్యారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు 19 గ్రామ పంచాయతీల్లో 1,122 ఉపాధి పనులకు గాను రూ.7.38 కోట్ల నిధులను ఖర్చు చేశారు. అనంతరం బహిరంగ చర్చా వేదికలో రూ.60,87,769 అవినీతి జరిగిందని డీఆర్‌పీలు, ఎస్ఆర్‌పీలు వెల్లడించారు. రూ.17,23,358 నిధులు రికవరీకి ఏపీడీ ఆదేశించారు. పనుల నిర్వహణలో అధికారుల తప్పిదాలకు రూ.1,04,000 జరిమానా విధించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పుష్పావతి, పీఆర్ జేఈ సుధాకర్, బెళుగుప్ప సర్పంచ్ సాలిబాయి, ఏపీఓలు సూర్యప్రకాశ్, కృష్ణమూర్తి, హౌసింగ్ ఏఈ శివారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

ముందుకు కదలని మురుగు



డీకే తండాలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు



చెత్తతో నిండిపోయిన డ్రైనేజీ

ఆత్మకూరు: ఆత్మకూరు మండలం గొరిదిండ్ల తండాలో మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీల్లో చెత్తా, చెదారం పేరుకుపోవడంతో మురుగు ముందుకు కదలడం లేదు. దోమల వృద్ధి చెందడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. గ్రామంలో మురుగు నీటి సమస్య ఉందని తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రజా ప్రతినిధులు పలు మార్లు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలో మురుగును తొలగించాల్సిన అవసరం ఉంది. అపరిశుభ్రత నెలకొన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించి, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

గార్లదిన్నె: మండలంలోని మర్తాడుకు చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. సోమవారం ఎస్ఐ మాట్లాడుతూ గ్రామానికి చెందిన ధర్మతేజ, మధు, నవీన్, శ్రీకాంత్, సుబ్బరాయుడు, జె.నవీన్ పాత కక్షల నేపథ్యంలో అదే గ్రామంకు చెందిన చందు పై దాడి చేశారన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

అనంతపురం: నగరంలోని సూర్యనగర్ రోడ్డులో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. నగరానికి చెందిన కార్పెంటర్ ఆచారి సైకిల్‌పై వెళ్తుండగా.. సూర్య నగర్ 80 అడుగుల రోడ్డు వద్ద అదుపుతప్పి కిందపడ్డాడు. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ అతడి మీద వెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు అతడ్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు.

గుత్తి: మండలంలోని కరిడి కొండ గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో యువకులు హనుమేష్, వెంకటరాముడు తీవ్రంగా గాయపడ్డారు. కె. ఊబిచెర్ల గ్రామానికి చెందిన వెంకటరాముడు, హనుమేష్ గుత్తికి బైక్‌లో వెళుతుండగా మార్గమధ్యలో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. గాయపడిన వారిని స్థానికులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తికి గాయాలు ...

కూడేరు: మండలంలోని ముద్దలాపురం సమీపంలో అనంతపురం – బళ్లారి ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహన ప్రమాదంలో బళ్లారికి చెందిన ఈరన్న గౌడ్ సోమవారం గాయపడ్డాడు. బళ్లారి నుంచి ద్విచక్ర వాహనంపై అనంతపురం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. స్థానికులు అతన్ని కూడేరు ఆస్పత్రికి తరలించారు.

పిచ్చి కుక్కల దాడిలో నలుగురికి..

కుందుర్పి: గ్రామాల్లో పిచ్చికుక్కల దాడులు అధికమయ్యాయి. సోమవారం ఉదయం మలయనూరులో చిన్నారులు కిరణ్, ప్రణీతతో పాటు మరో ఇద్దరిపై పిచ్చికుక్క లు దాడి చేసి, గాయపరిచాయి. వీరిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు చేయించారు. రెండు రోజుల క్రితం కెంచంపల్లిలో ముగ్గురిపైనా, కుందుర్పిలో ఇద్దరు, బెస్తరపల్లిలో ఒకరిపై పిచ్చికుక్కలు దాడిచేసి, గాయపరిచాయి.

బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో సోమవారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బైక్‌ను ఆర్టీసీ బస్సు ఎదురుగా ఢీ కొంది. ప్రమాదంలో బైక్‌లో ప్రయాణిస్తున్న లచ్చానపల్లినికి చెందిన నాగరాజు, దేవి దంపతులు గాయపడ్డారు. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి గాయాలు

గార్లదిన్నె: మండల కేంద్రంలోని డ్యాం రోడ్డు సమీపంలో పెట్రోల్ బంక్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రిటైర్డ్ ఉపాధ్యాయుడికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు క్రిష్ణమూర్తి నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా పెట్రోల్ బంకు వద్ద వెనుక నుంచి ద్విచక్రవాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని బంధువులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డుపై గుంతలు.. వాహనదారుల బేజారు

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత రోడ్ల అభివృద్ధి అటుంచితే.. కనీసం గుంతలు పడిన రోడ్లను పూడ్చే దిక్కు లేకుండా పోయింది. కలెక్టరేట్ సమీపంలోని బుక్కరాయసముద్రం చెరువుకట్ట రోడ్డుపై గుంతలు పడటంతో అధ్వానంగా తయారైంది. ప్రధానంగా గోశాల దాటి కొద్ది దూరం వెళ్లగానే రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. అన్ని వేళలా ఈ బైపాస్ రోడ్డు రద్దీగా ఉంటుంది. బైపాస్ కావడంతో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇలాంటి రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రయాణ సమయంలో వాహనదారులు తీవ్ర ఇబ్బందరులు పడుతున్నారు. గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కింద పడిన సందర్భాలు ఉన్నాయి. ఇక ఈ రహదారి వెంబడి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రయాణిస్తూ పరిస్థితిని గమనిస్తూనే ఉన్నా.. కనీసం మరమ్మతు చేయించే దిశగా చర్యలు తీసుకోలేదు.

గతంలో ఎంపీ నిధులతో మరమ్మతులు

గతంలో ఈ రోడ్డు పూర్తిగా పాడైనప్పుడు అప్పటి ఎంపీ తలారి రంగయ్య స్పందించి తన ఎంపీ ల్యాడ్స్ నిధులతో రోడ్డు మరమ్మతు చేయించారు. దీంతో సమస్య పరిష్కారం అయ్యింది. ప్రస్తుతం చెరువుకట్ట రోడ్డు ఒకచోట్ల పూర్తిగా దెబ్బతింది. కనీసం ఇప్పటికైనా స్పందించి గుంతలను మట్టితో పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

– అనంతపురం అర్బన్:



గుంతలమయంగా మారిన చెరువుకట్ట రోడ్డు



ప్రమాదకరంగా ఉన్న గుంతలు